క్లుప్తంగా

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నర్సయ్య

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో రూ.20లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఉపాధిహామీ పథకం నుంచి రూ.20లక్షలతో డ్రెయినేజీ, సీసీరోడ్డు నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకట్‌రెడ్డి, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామారావు, కృష్ణయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు నాగరాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సైదులు, నాయకులు చలసాని శ్రీనివాస్‌రావు, భాస్కర్‌రావు, వెంకటయ్య, హరిబాబు, కృష్ణయ్య, సైదులు, వెంకటయ్య, మనోజ్, రామకృష్ణ ఉన్నారు.

బరాఖత్‌గూడెంలో నేత్రదానం



మృతురాలి నుంచి నేత్రాలను సేకరిస్తున్న వైద్యసిబ్బంది

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన పోలిశెట్టి రాజ్యలక్ష్మి(84) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుమారులు తమ తల్లి అవయవాలు మరో నలుగురికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఖమ్మం నేత్రనిధికి ఆమె నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో నేత్రనిధికి చెందిన సిబ్బంది గ్రామానికి చేరుకొని మృతురాలి నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో మృతురాలి కుటుంబ సభ్యులు పోలిశెట్టి నాగేశ్వరరావు, పోలిశెట్టి యాదగిరి, గ్రామపెద్దలు ఎనుగుల నాగేశ్వరరావు, ఓరుగంటి రవి, జయప్రకాష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీకి సన్మానం



హైకోర్టు ఏజీపీ దంపతులను సన్మానిస్తున్న మాల మహానాడు యూత్ సభ్యులు

హుజూర్‌నగర్ : తెలంగాణ హైకోర్టు ఏజీపీగా ఇటీవల నియమితులైన పట్టణానికి చెందిన లచ్చిమళ్ల సందీప్ దంపతులను స్థానిక తిలక్ నగర్‌లో మాలమహానాడు యూత్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.శ్రీనాథ్, చంటి, వసంత, సుధాకర్, అశోక్, శ్యామ్, హరీష్, చందు, అబ్రహం, వెంకటేశ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు వెంటనే మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

నడిగూడెం : పెండింగ్‌లో ఉన్న సంక్షేమ నిధులు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం మూడోమండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీని ఎన్నుకున్నా రు. సంఘం మండల అధ్యక్షుడిగా పి.తిరుమలేష్, కార్యదర్శిగా చికుళ్ల ఉపేందర్, మరో 11 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మజీదుకు కూలర్ల బహూకరణ

అనంతగిరి : మండల కేంద్రంలోని మజీద్‌కు తెలంగాణ ముస్లిం మైనార్టీ కోదాడ డివిజన్ ఉద్యోగులు ఆదివారం కూలర్లను బహూకరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. రంజాన్ ఉపవాసాలు మొదలు కానున్న నేపథ్యంలో ఉపవాసం చేపట్టే వారికి వేసవి తాపాన్ని తగ్గించేందుకు కూలర్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జాకీర్, కార్యదర్శి గఫ్ఫార్ ఖాజామియా, షఫి, అబ్దుల్‌షరీఫ్ సిద్దిఖ్, అబ్దుల్‌రెహమాన్, ఖాసిం, మునీర్ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

- షెల్టర్లు ఏర్పాటు చేసినా బస్సులు నిలపని ఆర్టీసీ సిబ్బంది
- ఎండలో, వానలో బస్సుల కోసం దుకాణాల ఎదుట ప్రయాణికుల ఎదురుచూపులు
- మందుబాబులకు అడ్డాగా మారిన షైనం



మునగాలలో గణపరం క్రాస్‌రోడ్డులో బస్సు కోసం ఎదురుచూస్తున్న మహిళలు



మునగాల సివిల్ ఆస్పత్రి ఎదురుగా నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్

మునగాల : మండలంలోని జాతీయ రహదారి వెంట పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. దీంతో షెల్టర్లు అసాంఘిక కార్యకలాపాలకు, బాటసారులకు అడ్డాగా మారాయి. మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న గ్రామాలకు చెందిన ప్రజలు సూర్యాపేట, కోదాడ, హైదరాబాద్ పట్టణాలకు వెళ్లాలంటే రహదారిపై ఉన్న బడ్డీకొట్లు, దుకాణాల ముందు పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండలో, వానలో సైతం రోడ్డు పక్కనే నిలుచుని బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లలో కనీసం కూర్చునేందుకు బల్లాలు కూడా లేకపోవడతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై నిల్చున్న ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని మొద్దులచెరువు, మాధవరం, ఆకుపాముల గ్రామాల్లో జీఎమ్మార్ సంస్థ రోడ్డు విస్తరణ సమయంలో బస్‌షెల్టర్లను నిర్మించింది. కాని సంస్థ అధికారులు బస్‌షెల్టర్లు ప్రయాణికులు బస్సులు ఎక్కే, దిగే స్థలాల్లో ఏర్పాటు చేయకపోవడంతో అవి పదేళ్లుగా నిరుపయోగంగా మారాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని గణపవరం క్రాస్‌రోడ్డు, సివిల్ ఆసుపత్రి వద్ద నిత్యం రెండు, మూడు వందల మంది బస్సుల కోసం ఎదురుచూస్తుంటారు. కాని అక్కడ జీఎమ్మార్ సంస్థ వారు బస్‌షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంతో వారికి నిలువనీడ లేక రోడ్డుమీదనే నిలబడాల్సి వస్తుందని పలువురు మహిళలు, విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం స్పందించి ప్రయాణికులకు అవసరమైన చోట బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలు గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

బస్‌షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలి



జాతీయ రహదారిపై జీఎమ్మార్ సంస్థ నిర్మించిన బస్‌షెల్టర్లు నేడు నిరుపయోగంగా ఉన్నాయి. ఇవి ఉపయోగంలోకి రావాలంటే ఆర్టీసీ సంస్థ బస్సులను బస్‌షెల్టర్ల దగ్గర బస్సులను నిలిపితే ప్రయాణికులు బస్‌షెల్టర్లను వినియోగించుకుంటారు. అంతే కాకుండా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలి.

– ఎం.మహేష్,
బీసీ సంఘం నాయకుడు, మునగాల

ఉమ్మడి జిల్లాలో కబడ్డీ క్రీడను ప్రోత్సహించాలి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కబడ్డీ సీనియర్ క్రీడాకారులు

కోదాడ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కబడ్డీ క్రీడను ప్రోత్సహించాలని, అందుకు సీనియర్ క్రీడాకారులు ముందుండాలని పలువురు క్రీడాకారులు అభిప్రాయపడ్డారు. ఆదివారం పట్టణంలోని ఎంఎస్ కళాశాల ఆవరణలో సీనియర్ కబడ్డీ క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు క్రీడాకారులు, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని మాట్లాడారు. కబడ్డీ క్రీడకు ఆదరణ తగ్గకుండా చూడాల్సిన బాధ్యత సీనియర్లపై ఉందని, విద్యార్థులను, యువకులను ప్రోత్సహించి వారికి తగిన శిక్షణ ఇవ్వాలని కోరారు. హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో క్రీడాకారులు, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు దీపక్‌రెడ్డి, తాటికొండ కృష్ణారెడ్డి, మల్లయ్య, వీరయ్య, జాన్, పంది తిరపతయ్య, బాగ్దాద్, ముస్తాఫ, లింగయ్య, రమేష్‌బాబు, ఎస్‌కె.జానీ, శివ, రఫీ, మట్టారెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఐరా రియాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఈ పోటీలను తిలకించేందుకు అభిమానులు తరలివచ్చారు.



పోటీల్లో తలపడుతున్న ఇరుజట్ల సభ్యులు

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని కోనాయిగూడెం గ్రామంలో సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గత ఎన్నికల ముందు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మొండిచెయి చూపుతున్నారని విమర్శించారు. హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, దశల వారీగా పోరాటాలు చేస్తున్న పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీలం శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కె యాకూబ్, వట్టెపు సైదులు, మిట్టగడుపుల ముత్యాలు, అనంతప్రకాష్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే సేవలు మరువలేనివి



హుజూర్‌నగర్ : పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



నేరేడుచర్లలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : భారతదేశంలో అణగారిన మహిళల అభివృద్ధి కోసం మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా సావిత్రీబాయి పూలే చేసిన సేవలు మరువలేనివని బీసీ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో అణగారిన వర్గాల మహిళల అభ్యున్నతి కోసం సమన్యాయం కోసం ముందుండి పోరాడిన వీర నారి సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. స్వాతంత్ర్యం రాక మునుపు ఎన్నో వడిదుడుకులను ఎదుర్కొని సమసమాజ స్థాపన కోసం పోరాడిన మహనీయురాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గోవిందరావు, దీప, నర్సింహాచారి, చందు, రవి, సుధాకర్, క్రాంతి, పుల్లయ్య, హనుమంతాచారి పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఆదివారం ఎమ్మార్పీఎస్, బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ దూళిపాల ధనుంజయ నాయుడు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు యడవెల్లి అరుణ్‌కుమార్ మాట్లాడారు. ఆడపిల్ల చదువు కోసం తన ఇంటినే పాఠశాలగా మార్చి విద్యను నేర్పిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అన్నారు. ఆమె స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇంజమూరి మల్లయ్య, ఇంజమూరి వెంకటయ్య, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావుల సత్యం, పాండునాయక్, రాజు వెంకట్, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, నందిపాటి శ్రీనివాస్, రాపోలు వెంకన్న, నన్నెపంగ శ్రీను, మచ్చ రాకేష్, కార్తీక్ తదితరులున్నారు.

రంగస్థలంపై భావితరాలకు అవగాహన కల్పించాలి



బాలనాగమ్మ నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

మేళ్లచెరువు : భావితరాలకు రంగస్థల కళారంగంపై అవగాహన కల్పించాలని ఐరా రియాలిటీ, కృషి ఫౌండేషన్ చైర్మన్ పోశం నర్సిరెడ్డి, స్థానిక ఎస్ఐ పరమేష్ అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలో జరుగుతున్న మహాశివరాత్రి జాతరలో స్థానిక శ్రీశంభులింగేశ్వర నాట్యకళామండలి అధ్యక్షుడు పోశం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రదర్శించిన బాలనాగమ్మ నాటకాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచీకరణ నేపథ్యంలో కళలు అంతరించి పోకుండా కిష్టపట్టె ప్రాంతం రంగస్థలంపై అనేక ఇతిహాసాలు, పురాణాలు, చరిత్రలను బావితరాలు తెలియజేస్తున్నాయని, పిల్లలను కూడా కళారంగంవైపు దృష్టి సారించేలా చూడాలన్నారు. అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రముఖ హార్మోనిస్టు వినాయకరాజు దర్శకత్వంలో నాటకంలో మాయలఫకీర్ మాయలు మంత్రాలు, బాలవర్ధి, బాలనాగమ్మ, సంగు, పద్యాలు, తిప్పడు లచ్చి, తలారిరాముడు మంజరిలహాస్యం నటనలతో తెల్లవారుజాము వరకు అలరించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యపాల్‌రాజు, పోశం వెంకటరెడ్డి, పోశం వీరారెడ్డి, ఏసిరెడ్డి వీరారెడ్డి, కంబాల శ్రీనివాస్, నటులు ఎస్‌కె సైదులు, రాంబాబు, వీరమణి, ధర్మయ్యగౌడ్, హనుమారెడ్డి, శంకరాచారి, ఉప్పు కృష్ణరావు, ఎస్‌కె నజీర్, అశ్విని, శాంతి, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. బీటీ మరిచారు



కొండాపురం రోడ్డులో కంకర పరిచి బీటీ వేయకుండా వదిలేసిన రోడ్డు

చిలుకూరు : మండల పరిధిలోని బేతవోలు క్రాస్‌రోడ్డు నుంచి కొండాపురం మీదుగా మాధవగూడెం నుంచి మునగాల మండలం ముకుందాపురం వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.4కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాని ప్రస్తుతం జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఏడాదిన్నర కావస్తున్నా అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నేటి వరకు పూర్తి కాలేదు. ఈ రోడ్డు ప్రారంభంలో పనులు ముమ్మరంగా జరిగినా ఆ సమయంలో గ్రామ శివారులో సీసీరోడ్లు, కల్వర్టులు పూర్తి చేశారు. అనంతరం కాంట్రాక్టర్ బిల్లులు రాలేదని ఏడాది పాటు పనులు నిలిపివేశారు. తిరిగి వారం రోజుల క్రితం పనులు ప్రారంభించినా రోడ్డులో కంకర పరిచి మళ్లీ పనులు నిలిపివేశారు. దీంతో ఆ రోడ్డులో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ప్రయాణించాలంటే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. కంకర పరిచి పనులు చేయకపోవడంతో ద్విచక్రవాహనదారులు కిందపడి పలువురికి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయంపై తక్షణమే ఉన్నత అధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించి వేగంగా జరిగేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భవన నిర్మాణాలకు సుధాబ్యాంక్ రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న మహదేవ్

భానుపురి : సుధాబ్యాంకు ద్వారా భవన నిర్మాణాల కోసం రుణాలను మంజూరు చేయనున్నట్లు సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ తెలిపారు. ఆదివారం స్థానిక బాలాజీ గ్రాండ్‌లో బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు, గృహ నిర్మాణ రంగం ప్రముఖులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ నమ్మకానికి మారుపేరుగా నిలిచిన సుధాబ్యాంకు నందు భవన నిర్మాణ రంగంలో రుణాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్, డైరెక్టర్‌లు కక్కిరేణి చంద్రశేఖర్, ఏపూరి శ్రవణ్, భోనగిరి భాస్కర్, మీలా సందీప్, వైస్ చైర్మన్ పానుగోటి నిర్మల, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, పెద్దిరెడ్డి రాజా, సూర్యాపేట బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మడిపల్లి శంకర్ పాల్గొన్నారు.

పంటలు ఎండిన రైతులను ఆదుకోవాలి



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న పోకల వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్ నీళ్లు వస్తాయనే నమ్మకంతో సాగర్ ఆయకట్టు పరిధిలో వేలాది ఎకరాల్లో వరి పంటలు వేశారని, వానలు లేక, ప్రభుత్వం నీళ్లు ఇవ్వనందున, భూగర్భజలాలు తగ్గి బావులు, బోర్లు ఎండిపోయాయని, పంట చేతికొచ్చే దశలో ఎండి రైతులు ఆర్థికంగా నష్టపోయారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, మామిడి శ్రీనివాస్, చేవ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నడిగూడెం : మండలంలో ఎండిపోయిన పంట పొలాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందజేసి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల పరిధిలోని వేణుగోపాలపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా వందల ఎకరాల్లో పొలాలు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రేఖ తిరపయ్య, సంపతి పిచ్చయ్య, హరిబాబు, సోమలింగం, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

రెయిన్, మైహోమ్ పరిశ్రమలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న మైహోమ్ పరిశ్రమ అధికారులు

మేళ్లచెరువు : ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన గనుల, పర్యావరణ, ఖనిజ సంరక్షణ వారోత్సవాలు మగింపు వేడుకల్లో రెయిన్ సిమెంట్ పరిశ్రమకు మైన్స్ మేనేజ్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో బహుమతి వచ్చినట్లు పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. అదే విధంగా మైహోమ్ సిమెంట్ పరిశ్రమకు ఓవర్ ఆల్ పర్యావరణ పరిరక్షణ విభాగంలో బహుమతులు వచ్చినట్లు మైహోమ్ పరిశ్రమ అధికారులు తెలిపారు.

వెంకటయ్య జీవితం ఆదర్శనీయం



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరిరావు

గరిడేపల్లి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు సీపీఎం నాయకుడు మేదరమెట్ల వెంకటయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. ఆదివారం మండలంలోని కోనాయిగూడెంలో నిర్వహించిన వెంకటయ్య సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటం తనంతరం జరిగి పోరాటంలో సీతారామయ్యకు అండగా నిలడి పార్టీని నడపడంలో వెంకటయ్య ముఖ్యమైన పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, ములకలపల్లి రాములు, పల్ల వెంకట్‌రెడ్డి, ప్రకాష్, సైదులు, ముత్యాలు, బ్రహ్మం, శ్రీలం శ్రీను, దొడ్డ వెంకటయ్య, సోమయ్య, భిక్షం, మైబెల్లి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలమర్రిలో ఘనంగా రథోత్సవం



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

సూర్యాపేట రూరల్ : మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని పిల్లలమర్రిలో ఆదివారం తెల్లవారు జామున రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మహాదేవ నామేశ్వరస్వామి దేవాలయం నుంచి ఎరకేశ్వర స్వామి దేవాలయం వరకు గ్రామ వీధుల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని రథాన్ని లాగుతూ, డీజే పాటలకు నృత్యాలు చేశారు. వేడుకల్లో దేవాలయ కమిటీ చైర్మన్ కొట్ల సైదులు, డైరెక్టర్‌లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహదేవ్

దురాజ్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా రూ. 500లకే గ్యాస్ సిలిండర్ నేరుగా లబ్ధిదారులకు అందించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ తీసుకుంటే లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలలో పైసలు జమ చేస్తామనడం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఈ సమావేశంలో నిమ్మల ప్రభాకర్, పెంద్రా కృష్ణ దండుగల సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కల్నల్ శ్రీనివాసరావు

మునగాల : మోతె మండల కేంద్రం శివారులో గత నెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని విజయరాఘవపురం, రేపాల గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందిన సంఘటన విదితమే. వారి కుటుంబాలను ఆదుకునేందుకు గ్రామానికి చెందిన గ్రామీణ ఉద్యోగుల సమాఖ్య సభ్యులు రూ.1.26లక్షల విరాళాలను సేకరించి బాధిత కుటుంబాలకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు రిటైర్డ్ కల్నల్ సుంకర శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రభుత్వం మృతిచెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి మంజూరు చేయాలని, అదే విధంగా గాయపడిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు గుండు నర్సయ్య, కోశాధికారి దయాకర్, సభ్యులు పోతురాజు నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు సుంకర పిచ్చయ్య, మృతుల కుటుంబ సభ్యులు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కంఠమహేశ్వర స్వామి కల్యాణం

భానుపురి : సూర్యాపేట పట్టణంలో కంఠమహేశ్వర స్వామి సురమాంబ దేవి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణా నికి చెందిన గౌడ కులస్తులు శనివారం అర్ధరా త్రి స్వామి వారి ఆలయానికి బోనాలతో చేరుకొని ప్రదక్షిణలు చేశారు. అనంతరం జెట్టి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణాన్ని గౌడ కులస్తులు తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నిధులను ఇతర రంగాలకు కేటాయించొద్దు

మద్దిరాల : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర రంగాలకు కేటాయించడం మానుకోవాలని, ఆ నిధులను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంట నాగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నాగెల్లి రామనర్సయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.